ఫిర్యాదులకు గడువులోగా పరిష్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తారని తెలిపారు.

బీమా రంగంలో ధృవతార ఎల్ఐసి

కార్మిక వర్గానికి అవగాహన, ఆచరణ, సంఘీభావం ముఖ్యం
ఎల్ఐసి యూనియన్ జోనల్ నేత తిరుపతయ్య

మహాసభలో మాట్లాడుతున్న తిరుపతయ్య, వివిధ డివిజన్ల నుంచి హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న మార్పుల నేపథ్యంలో పాలసీదారుల సేవలను మరింత మెరుగుపరచి వారితో బంధాన్ని ధృడపరచుకుని ఎల్ఐసి బలోపేతానికి అందరూ కృషి చేయాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. కడప డివిజన్ యూనియన్ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుల కర్తవ్యాలను ప్రబోధించారు. కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడినా, పదేళ్ళ విభజన విధానాలకు, ఆర్థిక విధానాలకు ప్రజలు మద్దతివ్వలేదన్నారు. దేశాల మధ్య సమస్యలు పరిష్కరిస్తామని గొప్పలు పోయే బదులు దేశంలోని మణిపూర్ సమస్యను పరిష్కరించేందుకు, కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం లాంటి సంఘటనలను నివారించే దిశగా ప్రభుత్వం పని చేయాలన్నారు. నిరుద్యోగాన్ని నివారించాలని, ప్రభుత్వం చెబుతున్న ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం లోప భూయిష్టమైందని అన్నారు. పర్మనెంట్ ఉద్యోగాలకు బదులు అప్రెంటీసు నియామకాలంటే శ్రమదోపిడికి అవకాశం ఇవ్వడమే అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే అసలైన భారతీయత అని, దీనిని ఆటంకపరిచే వారిని ఉపేక్షిం చరాదని అభిప్రాయపడ్డారు. సమకాలీన పరిస్థితులపై అవగాహనతో సోదర సంఘాలతో సంఘీభావ కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగాలన్నారు. మహాసభల్లో కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి కె ఆర్ వి రవికుమార్ సందేశం ఇచ్చారు. జోనల్ కోశాధికారి ఆర్ శ్రీనివాసన్, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, రామాంజనేయులు, సుధీకర్, కామనూరు శ్రీనివాస్ రెడ్డి, అజీజ్, హరి, సుబ్బారెడ్డి మాట్లాడారు. మహాసభలకు డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షత వహించారు, యూనియన్ పతాకావిష్కరణ చేశారు, ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి ప్రవేశపెట్టిన కార్యవర్గ నివేదిక ఆమోదించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అవధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.అయ్యవారురెడ్డి, వై. కళ్యాణ్, కెపి సూరిబాబు, పిఎస్ రవిబాబు, ఆదోని, ప్రధాన కార్యదర్శిగా ఎ.రఘునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జి.వారిజాతమ్మ, కెసిఎస్ రాజు, ఎస్ శ్రీనివాసులు, ఆర్.సునీయకుమార్, కోశాధి కారిగా అమీనాపర్వీన్, సహాయ కోశాధికారిగా, పి.రత్న కిషోర్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎస్. అక్బర్ బాషా ఎన్నికయ్యారు.

'యురేనియం' బాధితులకు పరిహారం చెల్లింపు

గ్రామస్తుల నిరసనకు దిగొచ్చిన యుసిఐఎల్ అధికారులు
ఎట్టకేలకు రైతుల పొలంలోని వ్యర్థాలు తొలగింపు

వ్యర్థాలను తొలగిస్తున్న జెసిబి యంత్రం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని కెకె కొట్టాల గ్రామస్తుల నిరసనకు యురేనియం సంస్థ అధికారులు తలొగ్గారు. యురేనియం ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాల వెళ్లేందుకు పైప్‌లైన్ ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన బాధితులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను మంజూరు చేయడంతోపాటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేశారు. వివరాలు.. యురేనియం సంస్థ ఎట్టకేలకు తలొగ్గి యురేనియం బాధితులు 12 మందికి (5.62 ఎకరాలకు) రూ.2,82,084 పెండింగ్ బకాయిలు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఆర్‌డిఒకు చెక్కు అందజేశారు. ఈ నెల 16న యురేనియం పరిశ్రమ నుంచి కెకె కొట్టాల గ్రామ సమీపంలోని టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే గొట్టపు పైపులు లీకైన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి కొట్టాల గ్రామస్తులు టెయిలింగ్ పాండ్ పైపులకు నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలతో పాటు ఇచ్చిన ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఆందోళన చేశారు. వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, మబ్బు చింతలపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి మద్దతు తెలిపారు. గ్రామస్తులు ఆందోళనకు యురేనియం అధికారులు న్యాయం చేసేంతవరకు పోరాడుదామని చెప్పారు. గొట్టపు పైపులు లీకేజీ వల్ల కెమికల్ బురదంతా వెళ్లిన రైతు పొలాలను యురేనియం అధికారులు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని, అంతవరకు రైతుల పొలంలోకి వెళ్లిన కెమికల్ బురదను తొలగించేందుకు ఒప్పుకోమని తెగేసి చెప్పారు. దిగొచ్చిన అధికారులు ఎట్టకేలకు గొట్టపు పైపుల బాధితులకు ఇవ్వాల్సిన బకాయిలను, ఉద్యోగాలను పర్మినెంట్ చేశారు. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు పెండింగ్ పరిహారంతో పాటు ఇచ్చిన, ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో రైతుల పొలంలోని కెమికల్ బురదను యురేనియం అధికారులు యుద్ధ ప్రాతిపదికన యంత్రాలతో తొలగించారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జెసికి ఎస్ఎఫ్ఐ వినతిపత్రం

జెసికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యా రంగం సమస్యలు పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పి విద్యారంగాన్ని కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వంద రోజులపాలన పూర్తయినా విద్యారంగంలో ఉన్న సమస్యలను కనీసం ఎక్కడ కూడా పరిష్కరించడం లేదని అన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ఆపాలన్నారు. రాష్ట్రంలో ప్రయివేట్ కళాశాలలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 77 తక్షణమే రద్దు చేయాలని పేర్కొన్నారు. పులివెందులలో ఏర్పడిన ప్రభుత్వ వైద్య విద్య కళాశాలను వసతులు ఇవ్వమని ఎన్ఎంసి వారికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాజకీయ కక్షతోనే విద్యార్థుల జీవితాల్లో నిరాశ కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పేద విద్యార్థులు చదువుకునేటువంటి సంక్షేమ హాస్టళ్లు నేడు సంక్షేమానికి దూరంగా ఉంటున్నాయని, ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే జీవో నంబర్ 35,36,42ను రద్దు చేయాలని తెలిఆపరు. రాష్ట్రంలో ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేట్ చేయడం కోసం వేసే అడుగులను తక్షణమే ఆపాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలిపారు. జిల్లాలో శిథిల వ్యవస్థలో ఉన్న హాస్టల్లో కళాశాల భవనాలను నిర్మించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వివిధ స్కూల్లో కళాశాలలో సంక్షేమ హాస్టల్లో డిగ్రీ కళాశాలలో ఇన్వెస్ట్ లో ఉన్న సంవత్సరం నుంచి పరిష్కరించాలి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ , మండల నాయకులు నాగేంద్ర, పండు పాల్గొన్నారు.

పంచాయతీలకు పూర్వ వైభవం

ప్రజాశక్త-చెన్నూరు :గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, పంచాయతీలకు పూర్వ వైభవం వచ్చిందని టిడిపి మండల అధ్యక్షుడు కల్లూరి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చెన్నూరు గ్రామపంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే' అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేశారని, పంచాయతీ వ్యవస్థనే సర్వనాశనం చేశారని వాపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతూనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి అభివృద్ధికి పాటుపడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన వాగ్దానాలు అన్ని నెరవేరుస్తారని, దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా అమలు చేయబోతున్నారని పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజలకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, రాష్ట్ర రైతు నాయకులు మల్లికార్జునరెడ్డి, కాపు నాయకులు ఆకుల ప్రసాద్ బాబు, సీనియర్ మైనార్టీ నాయకులు షబ్బీర్ హుస్సేన్, సర్పంచ్ కళ్యాణ్, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఎలక్ట్రికల్ ఎఈ రామలింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ ఏడీగా పిచ్చేశ్వరరావు

ప్రజాశక్తి -కడప సిటీ

వైఎస్ఆర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా బి.పి చ్చేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బి. పిచ్చేశ్వరరావు తిరుపతి జిల్లాలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జి. నాగరాజరావు కర్నూల్‌కు బదిలీ అయ్యారు. ఈయన ఒక సంవత్సరం 25 రోజులపాటు ఇక్కడ పని చేశారు. జి నాగరాజు రావు రెండు రోజుల్లో కర్నూలు జిల్లాలో బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు.

అన్నదానం గొప్పది : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని సిఐటియు జిల్లా అధ్య క్షులు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సోమవారం బార్మి సందర్భంగా పాత బస్టాండ్ ఆవరణంలో సిఐటియు హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ ఆవరణంలోని సిఐటియు హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మస్తానవల్లి నాయకత్వంలో కార్యక్రమం ఏర్పాటు చేశారని పేర్కొ న్నారు. సంవత్సరంలో ఒకరోజు తమ లాంటి శ్రామికులకు, శ్రమ జీవులకు, పేదవారికి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయాలని భావి ంచారని చెప్పారు. 12 సంవత్సరాల నుంచి కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాజా, షబ్బీర్, సోనీ, మౌలాలి, ఖాదరు, గౌస్ పీర్,అల్లా బకాష్, అబ్దుల్లా, దస్తగిరి రెడ్డి, శ్రీరామ్ రాము, శ్రీనివాసులు, రామ్మూర్తి , మనీ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌గా షకీల్ అహ్మద్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరపాలక సంస్థ మేనేజర్‌గా షకీల్ అహ్మద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత సర్వసభ్య సమావేశంలో ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సర్వసభ్య సమావేశం తీర్మానం చేశారు. ఇందులో భాగంగానే ఆయన బాధ్యతలు చేపట్టారు. 1993లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన వంతు బాధ్యతలు నెరవేరుస్తానని తెలిపారు.

'కార్పొరేట్' చేతుల్లో దేశ సంపద

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
కడప 'ఉక్కు'ను నిర్మించాలి
సామాన్యులపై పన్నుల భారం తగ్గించాలి
బ్లాక్‌డే నిరసనలో వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలు లూటీ చేస్తున్నాయని వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు విమర్శించారు. వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బ్లాక్ డే నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు బి.మనోహర్, కె. శ్రీనివాసులరెడ్డి, వేణుగోపాల్, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తోందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన చట్టంలోని హామీలను కడప ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని పేర్కొన్నారు. వసూలు చేసిన ప్రీమియంలో 80 శాతం లాభాలు పేరుతో కంపెనీలు దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలపై విధించే పన్నును 30శాతం నుంచి 20శాతం తగ్గించారని, రైతుల వ్యవసాయ పరికరాలపై 18 శాతం జిఎస్‌టి వసూలు చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులు కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు రూ. లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇవ్వడం.. ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. ఇది వికసిత్ భారత్ కాదని అన్నదాతల ఆత్మహత్యలు, అప్పుల భారతదేశం అని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు. బ్లాక్ డే కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మద్దిలేటి, రైతు సంఘం నాయకులు గోపాలకృష్ణయ్య, బాల చంద్రయ్య, యానాదయ్య, రామాంజనేయ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చోరీల నివారణకు ప్రత్యేక బృందాలు

ముఖ్యమైన కూడళ్లలో నిఘా నేత్రాలు ఏర్పాటు
కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్

మీడియాతో మాట్లాడుతున్న డిఐజి కోయ ప్రవీణ్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

కడప జిల్లాలోనూ, పులివెందుల డివిజన్ ప్రాంతాలలో చోరీలు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాయలసీమ డిఐజి కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పి హర్షవర్ధన్ రాజుతో కలిసి పులివెందుల డిఎస్‌పి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలను అరికట్టేందుకు ఎస్‌పి ప్రణాళికలను సిద్ధం చేశారనాక్నరు. ఇప్పటివరకు తొమ్మిది పాత కేసులను చేధించి సుమారు రూ.5 లక్షలను రికవరీ చేశారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బయట నుంచి కొత్త వ్యక్తులు వచ్చి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జూదం, సారాయి, గంజాయి. మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక. దృష్టి సారిస్తున్నామని తెలిపారు. దుకాణదారులు, ఇంటి యజమానులు ఎక్కడికైనా వెళ్లేటపుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు ప్రజలు, మీడియా సహకారంతోనే నేరాలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. అనంతరం పులివెందుల డివిజన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ఆయన చర్చించారు. అంతకుమునుపు పలు రికార్డులు పరిశీలించారు కార్యక్రమంలో డిఎస్‌పి మురళీ నాయక్, సిఐలు జీవన్ గంగనాథ్ బాబు, రమణ, హాజివల్లి, ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కాశినాయన

ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేదలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని, అందరూ ఆయన అడుగుజాడల్లో నడిచి మన సమస్యలను పరిష్కరించుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురం సభా భవనం ఏచూరి సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుండే ఉద్యమ రూపంలో ఉద్యమకారుడుగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పోలయ్య, కెవిపి ఎస్ నాయకులు ప్రవీణ్ కుమార్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని కత్తెర గండ్ల పంచాయతీలో ఉన్న ఆకుల నారాయణ పల్లె పేదలు సాగు చేసుకుంటున్న బంజరు భూమిలో కొలతలు వేయించి పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్, పోలయ్య డిమాండ్ చేశారు. సోమవారం వారు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ నరసింహులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూ కబ్జాదారుడైన శ్రీనివాసులురెడ్డి భూములపై ప్రభుత్వం ఎందుకు సర్వే చేయించలేదని ప్రశ్నించారు. 2017 సంవత్సరంలో ఆరుగురు తహశీల్దార్లు సర్వే చేసి రిపోర్టు తయారు చేశారని, దాని ప్రకారం కబ్జాదారుడి భూములను ఎందుకు రద్దు చేయాలేదని తహశీల్దార్‌ను అడిగారు. వందల ఎకరాలు డికెటి బినామీ పట్టాలు ఆయన దగ్గర ఉన్నాయని, సమగ్ర విచారణ జరపాలని కోరారు. అసలు ఆరుగురు తహశీ ల్దార్ల రిపోర్టులు బయటకు తీస్తే భూ కబ్జాదారుల బండారం బయట పడుతుందని పేర్కొన్నారు. స్పందించిన తహశీల్దార్ నరసింహులు వెంటనే విచారణ చేయించి వాస్తవాలన్నీ జిల్లా సర్వోన్నత అధికారికి పంపిస్తామని ఆయన తెలిపారు.

టిడిపిలోకి కార్పొరేటర్ సూర్యనారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్: పాత కార్యకర్తలకు గౌరవం ఇస్తూనే కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసురెడ్డి అన్నారు. సోమవారం 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ రావుకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అభివృద్ధి కోసం అవసరమైన వారిని పార్టీలో కలుపుకుని పోతూ అభివృద్ధికి పనిచేస్తామన్నారు. 25వ డివిజన్‌లో ఏమేమి అవసరాలు ఉన్నాయో తెలుసుకుని అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. సూర్యనారాయణ రావు ఒక మంచి పరిపాలన చేస్తున్న పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడం సంతోషించ దగ్గ విషయమన్నారు. అనంతరం సూర్యనారాయణ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి చూసి ప్రజల కోసం టిడిపిపిలో చేరుతున్నానని తెలిపారు. ఆయనతో పాటు 100 మంది పార్టీ కండువా కప్పుకున్నారు.

మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలలో చదు వుతున్న విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి. పి. నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని బాలుర హాస్టల్‌లో పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్ బిల్లులు ఇవ్వకుండా సామాజిక న్యాయ బస్సు యాత్ర చేయడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, గురుకుల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎనిమిది నెలలుగా మెస్ ఛార్జీలు అందలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోవడంతో నిర్వహణ చాలా భారంగా మారిందని వార్డెన్లు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. హాస్టల్ విద్యార్థు లకు గతంలో లాగా నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్, యూనిఫామ్, పెట్టెలు, గ్లాసులు, కాస్మెటిక్ చార్జెస్ ఇవ్వాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరుణ్, కృష్ణ, తేజ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం కడప, కడప మండల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో ఎంఇఒ గంగిరెడ్డి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్, పెయింటింగ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, మండల విద్యాశాఖ, కాలుష్య నియంత్రణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : విజయదశమి ఉత్సవాల కరపత్రాలను కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. సోమవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె కరపత్రాలను ఆవిష్కరించారు. తితిదే తరపున ధార్మిక కార్యక్రమాలు భువనేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి.గోపి బాబు తెలిపారు. కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కె.వి. సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, మల్లికార్జునరావు, శివ, వీర, టిడిపి ప్రజా ప్రతినిధులు శ్రీను, జయశంకర్, ఉక్కాయిపల్లి చల్మారెడ్డి పల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన : డిసిసి

ప్రజాశక్తి - కడప : 'సూపర్ సిక్స్' పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న కడప కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ విభాగాలు నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, అధికారులు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతన్న 'సేవలో వ్యవసాయ శాఖ అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పొలం పిలుస్తోంది అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ, పులివెందుల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారం వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పొలాలను పరిశీలిస్తారన్నారు. రైతులను కలిసి నాణ్యమైన అధిక దిగుబడులు రావడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్ రెడ్డి, స్థానిక డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, రమేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో..

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మన్మోహన్ తెలిపారు. మధ్యాహ్నం లక్ష్మీపేట గ్రామంలో కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం మడూరు, అన్నవరం సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎ.ఒ. కోరారు.

ముద్దనూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి చాముండేశ్వరి, తహశీల్దార్ రామమూర్తి, ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్, ఎఒ వెంకటకృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. మంగళవారం ఉప్పలూరు రైతు సేవా కేంద్ర పరిధిలోని మాదన్నగారిపల్లె, కోనాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎఒ చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఇబ్రహీం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి పాల్గొన్నారు.

ప్రజలు కోరుకున్న పాలనకు వంద రోజులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు మండల పరిధిలోని గోపవరం గ్రామ పంచాయతీలోని భగత్‌సింగ్ కాలనీ, ఆచార్య కాలనీలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బచ్చల పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సిఎం సురేష్ నాయుడు, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, వియస్ ముక్తియార్, టిడిపి మండల కన్వీనర్ బోడేల బాబుల రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, యువ నాయకుడు బచ్చల వీరప్రతాప్, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

చాపాడు : వంద రోజుల్లో ప్రజలకు ప్రభుత్వం చేపట్టిందని టిడిపి మైనార్టీ నాయకులు నాయబ్‌రసూల్, జైనుల్లా తెలిపారు. ఖాదర్‌పల్లెలో అధికారులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఎ గోపి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె : కూటమి ప్రభుత్వం ద్వారా పేదలకు సంక్షేమం చేపట్టిందని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. టి.వెలమవారిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంపత్ దివిజా, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షఫీర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు, టిడిపి సీనియర్ నాయకుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హిమకుంట్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పద్మనాభరెడ్డి, పంచాయతీ సెక్రటరీ ప్రతాపరెడ్డి, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండలంలోని ఇల్లూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఎన్టీఆర్ సుజల స్రవంతి ఉచిత మంచి నీటి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ దేవగుడి జగదీష్, మండల ఎన్‌డిఎ కూటమి అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, జనసేన కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దువ్వూరు : గుడిపాడు గ్రామపంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్యఅతిథిగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ షేక్ ఇమామ్, ఎంపిడిఒ శివప్రసాద్, మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు

వైసిపి నేతల్లా దౌర్జన్యాలు చేయలేదు

ప్రజాశక్తి - వేంపల్లె

గత వైసిపి ప్రభుత్వ పాలనలో వైసిపి నేతలు చేసిన దౌర్జన్యాల్లా ప్రస్తుత టిడిపి నేతలు ఎక్కడా చేయడం లేదని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షఫీర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలకు, సామాన్య ప్రజలకు గానీ ఎక్కడా చిన్న నష్టాన్ని కూడా పార్టీ నేతలు చేయలేదని తెలిపారు. ప్రజలకు సత్తా చాటే విధంగా జరుపనున్నామని, ఈ విషయాన్ని అధికారులు, ప్రజలు గుర్తించుకోవాలని సూచించారు. టిడిపి కార్యకర్తలు ఎక్కడా చేయడం లేదన్నారు. ఏమైనా చిన్న సంఘటనలు జరిగి ఉంటే మాకు, వైసిపి నేతలకు జరిగి ఉంటాయి కానీ ప్రజలకు హాని జరిగే కార్యక్రమాలు లేవన్నారు. సమావేశంలో టిడిపి నేతలు వేమకుమార్, బాలకృష్ణారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, శివప్రసాద్‌రెడ్డి, వెంకటేష్, జబీబుల్లా, డక్కా రమేష్, రమణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాగునీటి మోటార్ వైర్లు చోరీ

ప్రజాశక్తి - ముద్దనూరు

పులివెందుల రహదారిలో ఉన్న సాయినగర్ కాలనీ మసీదు, డ్రైవర్ కాలనీ వద్ద ఉన్న రెండు తాగునీటి మోటర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు ఈఓపిఆర్డీ వీరభద్రుడు తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ దస్తగిరి తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాపాఘ్ని నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు సిఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇసుక లోడుతో ఉన్న టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తామన్నారు. అనుమతి క్వారీ నుండి ఇసుకను తరలించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టామన్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న వారిలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

అక్రమంగా చేపల వేట

శెట్టివారిపల్లె వద్ద కాలువలో అడ్డంగా వేసిన వలలు

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు నుండి వామికొండ, సర్వరాయ సాగర్ రిజర్వాయర్లకు వెళ్లే గాలేరు-నగరి ప్రధాన కాలువలో, వామికొండ రిజర్వాయర్ జలాశయంలో మత్స్యశాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా చేపలు పడుతున్నారని సోమవారం ఉప్పలూరు సర్పంచ్ పల్లా గంగయ్య ఆరోపించారు. కాలువలో, వామికొండ జలాశయంలో పెద్దపెద్ద వలలు వేసి అక్రమంగా టన్నుల కొద్దీ చేపలు పట్టుకుంటున్నారన్నారు. చేపలు ఐస్ పెట్టెల్లో నిల్వ ఉంచి వ్యాన్లలో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని తెలిపారు. రెండుమూడు రోజులు ఇక్కడే ఉంటూ వంట వార్పు చేసుకుని పగలు, రాత్రి చేపలు పడుతున్నారని తెలిపారు. కార్యదర్శికి, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. శెట్టివారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న గాలేరు-నగరి కాలువలో రెండు చోట్ల పెద్ద వలలు కాలువకు అడ్డంగా వేసి చేపలు పడుతున్నారని ప్రజలు చెబుతున్నారు.

అనుమతులు మంజూరు చేయలేదు : జిఎన్ఎస్ఎస్ కాలువలో చేపలు పట్టేందుకు టెండర్ల వేయలేదని, అనుమతి కోసం ఎలాంటి దరఖాస్తులు రాలేదని కడప మత్స్యశాఖ అధికారి కిరణ్ తెలిపారు. చేపలు పట్టేందుకు మత్స్యశాఖ నుండి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదన్నారు.

వామికొండ వద్ద చేపలు ఉంచిన ఐస్ పెట్టెలు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పూలంగళ్ల సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీరామ హాల్ రోడ్డు మీదగా పూలంగళ్ల సర్కిల్ వరకు చేరుకొని అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, భానుప్రకాష్, టిడిపి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, బొజ్జ మైసూరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రహంతుల్లా, పురపాలక వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్‌బాషా, డేనియల్, డేని, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య కళాశాలలో..

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీలోని పశు వైద్య కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మై భారత్ టోపీలు, గ్లౌజులు, శానిటైజర్, పెన్నులు, బుక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వాణి, డాక్టర్ పాండురంగారెడ్డి, గాయత్రి, రాజేష్ పాల్గొన్నారు.

పలువురిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవి నాష్‌రెడ్డి తెలిపారు. పులి వెందుల నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలం బోనాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వైసిపి నాయకులు రామక్రిష్ణారెడ్డి, రామిరెడ్డి కుటుంబాలను సోమ వారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి వైసిపి కుటుంబానికి అండగా ఉంటూ అన్ని విధాలాఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బాబుల్‌రెడ్డి, రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శరీర దృఢత్వానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

శరీర దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం రెండవ రోజు మండలస్థాయి అథ్లెటిక్ క్రీడా ఎంపికలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి మండలాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యాయామ ఉపాధ్యాయ కో-ఆర్డినేటర్ మాధవరెడ్డి, పీడీలు ఇజ్రాయిల్, దేవిక ఇంద్ర, రాజ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా చాముండేశ్వరి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మండల ప్రత్యేకాధికారిగా కడప జిల్లా పౌర సంఘరాల శాఖ జి.చాముండేశ్వరి సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలోని ఉప్పలూరు, వేల్పుచెర్ల, చిన్నదుద్యాల, కొలవలి గ్రామ పంచాయతీల్లో ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్, చాముండేశ్వరి పర్యటించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అధికారులు, ఉద్యోగులు సహకరించాలని ఆమె కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి విజయభారతి, మాజీ ఉప సర్పంచ్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలోని మహాత్మాజ్యోతిభా పూలే సంక్షేమ గురుకుల పాఠశాల వనిపెంటలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డెమో ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ / పార్ట్ టైమ్ టీచర్స్‌ను భర్తీ చేస్తున్నామని, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపల్ కెవిఎస్ రామకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26లోపు దరఖాస్తులు పంపాలన్నారు. పిజిటి ఇంగ్లీషు 1, టీజీటి ఇంగ్లీషు1, టీజీటి సైన్స్ 1, టిజిటి సోషల్ ఒకటి ఉన్నాయన్నారు. పిజిటి, టిజిటికి పీజీ, బిఎడ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలకు 63037 67626, 94403 20575 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఇంటి యాజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఇంటి యాజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ సురేష్‌రెడ్డి కోరారు. పులివెందుల డిఎస్‌పి ఆదేశాలు మేరకు జిల్లాలోని పలుచోట్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటింటికి వెళ్లి పోలీసులు అవగాహన కల్పించారు. జాగ్రత్తలకు సంబంధించిన నోటీసు పత్రాలను పోలీసులు పంపిణీ చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ముందస్తు సమాచారం ఇస్తే ఇంటిపై నిఘా పెడతామని ప్రజలకు సూచించారు.

ఇ-క్రాప్ నమోదులో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇ-క్రాప్ నమోదులో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆ కారణంగా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పుల్లూరు గ్రామ సచివాలయంలో ఇ-క్రాప్ నమోదు కోసం పెద్ద ఎత్తున రైతులు వెళ్లారు. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయ అధికారి అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆరోపించారు. సోమవారం చివరి రోజు కావడంతో పంట నమోదు కోసం కార్యాలయానికి వెళితే అందుబాటులో లేరని రైతులు చెబుతున్నారు.

గొల్లలగూడూరులో పోషక ఆహార మాసోత్సవం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని గొల్లలగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిషోర్ బాలలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సహాయకురాలు, పంచాయతీ సెక్రెటరీ, ఆశ, ఎఎన్ఎం, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.

తీవ్ర వర్షాభావంతో తగ్గిన దిగుబడులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని ఎఒ శివ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లోమడ గ్రామంలో సోమవారం సోయాబీన్ పంటపై పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగం కొలతల ఆధారంగా దిగుబడి 2.5 కేజీలు రావాల్సి ఉండగా, కేవలం 1.3 కేజీలు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఈ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థులు బలి కావాలా : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

నాడు- నేడు పనుల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రభుత్వ అధికారులు వెళ్లబుచ్చుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లె అజయ్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నరసనపల్లె ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన నాడు-నేడు పనుల వల్ల విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది అధికారులు, చైర్మన్‌ల నిర్లక్ష్యం కావచ్చన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వమైనా స్పందించి పిల్లల జీవితాలను దృష్టిలో పెట్టుకొని ఆ పనులు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి అరవింద్, కమిటీ సభ్యుడు దేవా పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

ఆర్‌టిడి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో సోమవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వ హించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. కళాశాల కరస్పాండెంట్ ఎల్.తరుణ్ ఇంద్రశేఖర్, ప్రిన్సిపల్ టీ చంద్ర శేఖర్‌రెడ్డి కళాశాలలో చేరిన నూతన విద్యా ర్థులకు ఆహ్వానం పలుకుతూ.. మూడేళ్ల సుదీర్ఘ విద్యా కాలంలో బాగా కష్ట పడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా, చెన్నూరు మండలం, శివాలయం వీధిలో నివాసం ఉంటున్న శివ ప్రసాద్ భార్య ఎరుకుపాడు లక్ష్మీదేవి అను నాకు చెందిన పాస్ పోర్ట్ కడప నుండి ఆటోలో చెన్నూరు వస్తుండగా చెన్నూరు కొత్తరోడ్డు వద్ద బ్యాగు కనబడలేదు. అందులోని నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **U8432369** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు తెలుపగలరు.

చెకుముకి గోడ పత్రికలను అవిష్కరిస్తున్న చక్రపాణిరెడ్డి

రేపు మండల స్థాయి చెకుముకి పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయిలో చెకుముకి పోటీలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా నాయకులు బాల బయన్న, గంగాధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో చెకుముకి సైన్స్ గోడ పత్రికలను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని కోరారు. ఈ పోటీలకు 8,9,10 తరగతుల విద్యార్థులు హాజరుకావాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

26న పరికరాల ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - చాపాడు

విభిన్నప్రతిభావంతుల సహాయ పరికరాల కోసం ఈనెల 26న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 26న మధ్యాహ్నం 2 గం నుండి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎల్ఐఎంసీఓ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల పరిధిలోని విభిన్నప్రతిభావంతుల పిల్లలు, పెద్దలకు బ్యాటరీ సైకిళ్లు, స్మార్ట్ ఫోన్లు, సీపీ ఛైర్స్, వీల్ ఛైర్స్, కాలిపర్స్, ట్రై సైకిళ్లు, చెవిటి పరికరాలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, రేషన్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతోపాటు రెండు ఫొటోలు తీసుకరావాలని సూచించారు.

విద్యుత్ ఎఇగా నాగరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండలం విద్యుత్ శాఖ మండల ఇంజనీర్‌గా టి.నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సుంకేసుల రోడ్డులోని విద్యుత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి ఎఇగా సబ్ ఇంజనీర్ గోవర్ధన్‌రెడ్డి కొనసాగేవారు. చాలా కాలంగా మండలం ఇంజనీర్ నియామకం జరగలేదు. బాధ్యతల స్వీకరణ అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం విద్యుత్ కాంట్రాక్టర్లు, టిడిపి నాయకులు నాగపట్నం రామ సుబ్బయ్య, కరెంటు వెంకటయ్య ఎఇకి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు.

వెలుగు ఎపిఎంగా శైలజ నియామకం

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మండల ఎపిఎంగా శైలజ రానున్నారు. గతంలో ఇక్కడ ఎపిఎంగా పని చేసిన వెంకటరమణ రాజు చింతకొమ్మదిన్నె మండలానికి బదిలీ అయ్యారు. శైలజ గతంలో ఖాజీపేటలో పని చేశారు. ఇక్కడికి రావడం ఆమె ఇది రెండవ సారి.

అనుమతి లేకుండా మట్టి తోలితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మండలంలో ప్రభుత్వ భూముల్లో, పట్టా భూముల్లో మట్టి తోలుకోవాలనుకుంటే తప్పక అనుమతులు తీసుకోవాలని, అలా కాకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. అంతేకాకుండా యంత్రాలను సీజ్ చేస్తామని, జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. మోటునూతల గ్రామంలో మట్టి తోలుతున్నారని సమాచారం రావడంతో వెంటనే ఆర్ఐ, విఆర్ఓను అక్కడికి పంపించామన్నారు.

దేవాదాయ శాఖ భూముల వేలం

ప్రజాశక్తి - పెద్దముడియం

పెద్దపసుపులలో 10 ఎకరాల 40 సెంట్లు వంకదార సుబ్బయ్య ఆలయ భూములను సోమవారం మాధవరాయ స్వామి గుడిలో జిల్లా ఆలయ పర్యవేక్షణ అధికారి నరసింహస్వామి సమక్షంలో ఇఒ విశ్వనాథరెడ్డి వేలం వేశారు. ఈ వేలం పాటలో మండలంలోని రైతులు విరివిగా పాల్గొనగా పెద్దపసుపుల గ్రామానికి చెందిన తల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి అనే రైతు రూ.2.67 లక్షలకు కౌలు సొంతం చేసుకున్నాడు. మండలంలోని ఎన్.కొట్టాలపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి వేలంపాట నిర్వహించిన భూమి తనదే అంటూ ఈ 10.40 ఎకరాల భూమిపై సర్వహక్కులు తమకున్నాయని తెలిపారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తుందని ఎలాంటి నోటీసులు అందించకుండా ఆలయ అధికారులు వేలంపాట నిర్వహించారన్నారు. అనంతరం ఇఒ స్పందిస్తూ దేవాదాయశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే వేలంపాటను కరపత్రాల ద్వారా గ్రామాల్లోని రైతులకు సమాచారమిచ్చామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఆర్ నరసింహస్వామి, ఇఒ విశ్వనాథరెడ్డి, అటెండర్ లక్ష్మయ్య, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్ఐ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రశ్నించాల్సిన డిప్యూటీ సిఎం మౌనమెందుకో..!

- వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో కానీ, మరి ఎక్కడైనా ఎవరికి ఏ అన్యాయం జరిగినా మేమున్నామని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉప సిఎం ఎన్నో పరిణామాలు జరుగుతున్నా ఒక్క సారైనా మీరు పూర్తిగా ప్రశ్నించారా అన్నారు. రాష్ట్రంలో కొన్ని రోజుల నుండి ఒక పరిణామం తర్వాత మరొకటి జరుగుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయివేటీకరణకు అనుకూలంగా చర్యలు తీసుకుంటూంటే ఇప్పటికీ మీరు స్పందించలేదన్నారు. తిరుమల లడ్డూ విషయమై ముఖ్యమంత్రి మాట్లాడారని, దానిపై కూడా స్పందన లేదన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పార్టీలు, పదవులకతీతంగా మీరు ఇప్పటికైనా నిజాయితీగా మాట్లాడాలని పవన్‌కు సూచించారు. సిబిఐతో వెంటనే విచారణ చేయించాలన్నారు. లేనిపక్షంలో ప్రశ్నించడానికి పుట్టిన జనసేన పార్టీ, జన సైనికులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటుందని చెప్పకనే మీరు చెప్పినట్లు అవుతుందన్నారు. వెంటనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకుండా చూడాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE IIIAddl. JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 135/2023

Penumaru Naga Subba Reddy, S/o Sreeramulu Reddy, Hindu, Aged 76 years, R/at Kanaparthi (V), Chennur Mandal, Kadapa Dist.

...Plaintiff

Vs

Kandula Venkata Ramana Reddy, S/o Krishna Reddy, Hindu, aged 50 years, R/o.D.No.19/336, H.G.S.Street, Kadapa City and Dist.

...Defendant

ప్రతివాదికి నోటీసు

పై దావాలోని వాది ప్రతివాది అయిన మీ పైన రికవరీ ఆఫ్ అమౌంట్ కొరకు దావా వేసియున్నారు. సదరు దావా 26.09.2024వ తేదీన వాయిదా వున్నది. సదరు దావాలో మీకు ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల సదరు దావా అనగా 26.09.2024 తేదీన ఉ॥10.30 గం॥లకు మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పైన పరోక్షముగా తీర్పు తీర్మానించబడును.

//By Order of the Court//

వి.రామమోహన్, కె.రామమోహన్, బి.ఎన్.అక్బర్ అలీఖాన్,

అడ్వకేట్స్, కడప.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE, PRODDATUR

E.P.No. 44/2023

O.S.No. 59/2022

Kundeti Murali Yadav, S/o K.Bala Subbaiah Yadav, aged about 68 years, Hindu, Business, Resident of bearing plot No.18, S/part, Sri Krishna Nagar, Bagh Hayathnagar, Hayathanagar, RR District, Telangana State.

...Petitioner/D.Hr.

Vs

5. Polimera Krishnaveni, D/o Kummithi Rama Subba Reddy, aged about 40 years, Hindu, Private employee, Resident of Teachers colony, 4th Ward, Khajipet Town and Post, Kadapa District.

...Respondent No.5/J.Dr.No.5

నోటీసు

ఈ నెంబరు E.P.ని D.Hr., J.Dr/s పైన రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి E.P.లో J.Dr.No.5అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమేమనగా 25/10/2024వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటూ ఉన్నది. కావున పై నెంబరు E.P. నందు ఉదయం 10.30 గం॥లకు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గానీ, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవచ్చును. లేనంతట రాజశ్రీ కోర్టు వారు మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 25.10.2024.

//By Order of the Court//

బి.సి.మాదయ్య

అడ్వకేట్, ప్రొద్దుటూరు.